సాక్షి నిర్మల్

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



చిన్నోడికి.. పెద్ద కష్టం

ఆడుతూ పాడుతూ తిరిగే చిన్నారి అనారోగ్యానికి గురి కావడంతో నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

IIలో▸



ఆధునిక సాగుతో లాభాలు

సంప్రదాయ సాగుతో విసుగుచెందిన రైతులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. తక్కువ నీటితో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు.

IIIలో▸

గరిష్టం/కనిష్టం
39.6 /24.8

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. భానుడి ప్రతాపం కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రైస్ మిల్లులు తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

భైంసాటౌన్: భైంసా పట్టణ శివారులోని రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ రాంబాబు, డీసీఎస్‌వో తనూజ, డీఎం శ్రీకళ శుక్రవారం తనిఖీ చేశారు. 2021–22 రబీ సీజన్ సీఎంఆర్ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా వందశాతం బియ్యం అప్పగించాలని యజమానులకు సూచించారు. వారి వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అడెల్లి పోచమ్మ ఒడిబియ్యం సేకరణకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించే ఒడిబియ్యం సేకరించుకునే హక్కుల కోసం ఆలయ ఈవో రవికిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. అడెల్లి గ్రామానికి చెందిన వ్యాపారి కె.లక్ష్మణ్ 1.14 లక్షలకు హక్కు దక్కించుకున్నాడు. 2023 ఏప్రిల్ 21 నుంచి 2024, ఏప్రిల్ 20 వరకు లక్ష్మణ్ ఒడిబియ్యం సేకరిస్తాడని ఈవో తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈఏడు రూ.వెయ్యి అధికంగా ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు చందు, స్థానిక సర్పంచ్ సుచరిత, ఆలూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధని ఎంపీటీసీ శ్రీనివాస్, డైరెక్టర్ పురుషోత్తంరావు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణే ముఖ్యం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పీపీ వినోద్‌రావు

ఖానాపూర్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని నిర్మల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు అన్నారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని ఎల్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో విజేత హైస్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, న్యాయవాది వెంకట్ మహేంద్ర, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, నాయకులు లక్ష్మీనర్సయ్య, మదిరె శ్రీనివాస్, తోట సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ముస్లింలు రంజాన్ పండుగను శనివారం జరుపుకోనున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఈద్గాలో, ఇటీవల చించోలి(బి)లో ప్రారంభించిన ఈద్గాలో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. చించోలి(బి) ఈద్గాలో ఏర్పాట్లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మంచి నీటి వసతి, పార్కింగ్, టెంట్లు వేసే పనులను పర్యవేక్షించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ కోరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రాలిన ఆశలు

- జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం
- రాలిన మామిడి కాయలు..
- నేలవాలిన వరి, నువ్వు పంటలు
- కొట్టుకుపోయిన ఇళ్ల పైకప్పులు
- విరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు



కల్లెడలో నేలరాలిన మామిడి కాయలు చూపుతున్న రైతులు



నేలకొరిగిన బాస్మతి వరి పంటను చూపుతున్న రైతు



కొండుకూరులో గాలికి కొట్టుకుపోయిన రేకుల షెడ్డు

నిర్మల్: ఈదురు గాలులు గురువారం రాత్రి జిల్లాలో బీభత్సం సృష్టించాయి. బలమైన గాలుల ధాటికి ఆ రైతుల ఆశలు రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నేలవాలాయి రేపోమాపో కోయాల్సిన మామిడి కాయలు రాలిపోయాయి. జిల్లా మొత్తం 600 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు. కడెం మండలంలోనే 400 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం జరిగిందని తెలిపారు. ఇక పేదల ఇళ్ల పైకప్పులు గాలుల ధాటికి కొట్టుకుపోయాయి. బలమైన గాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఒక్కసారిగా..

వారం పదిరోజులుగా జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రధానంగా ఖానాపూర్ నియోజకవర్గంలోని మండలాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌పైనే ఉంటోంది. దస్తురాబాద్‌లో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అలాంటిది గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. కడెం, దస్తురాబాద్, లక్ష్మణచాంద, ఖానాపూర్ మండలాల్లో వందల ఎకరాల్లోని మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మామడ మండలం పొన్కల్‌తోపాటు పలు గ్రామాల్లో వరి పంట నేలవాలింది. పొన్కల్, అనంతపేట్, పోతారం గ్రామాల్లో 24 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

కడెం మండలంలో ఎక్కువ నష్టం..

కడెం: ఈదురుగాలులు, వర్షానికి ప్రధానంగా కడెం మండలంలో నష్టం ఎక్కువగా జరిగింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలులకు వృక్షాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నిర్మల్ – మంచిర్యాల ప్రధాన రహదారిపై సుమారు 60 చెట్లు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఈ మార్గంలో బస్సులు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కల్లెడ, నవాబ్‌పేట్, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో సుమారుగా 400 ఎకరాల విస్తీర్ణంలోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. సుమారు రూ.2 కోట్ల నష్టం జరిగింది. ధర్మాజీపేట గ్రామానికి చెందిన మంతెన అశోక్ ఎనిమిది ఎకరల్లో సాగు చేసిన బస్మాతి వరి పంట గాలికి నేలవాలింది. రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లింది. వకీల్ నగర్ గ్రామానికి చెందిన గిరిజన రైతు రమేశ్ నాలుగు ఎకరాల్లో వేసిన మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలింది. కొండుకూరు గ్రామానికి చెందిన క్లోం సతీశ్‌రెడ్డి పసుపు పంట అమ్మకానికి సిద్ధంగా ఉంచగా, వర్షానికి తడిసింది. మండలంలో వందల ఎకరాలలో నువ్వు పంట నేలపాలయింది. కొండుకూరు, ధర్మాజీపేట్, కడెం, కన్నాపూర్‌లో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

ఖానాపూర్ మండలంలో..



బాధితుడికి ఆర్థికసాయం చేస్తున్న జెడ్పీటీసీ

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. పలు గ్రామాల్లోని ఇంటి పైకప్పులు కొట్టుకుపోయాయి. తర్లపాడ్ గ్రామానికి చెందిన పంతంగి రాజేశ్వర్‌కు చెందిన పశువుల పాక కూలి రెండు గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన బి.రవి ఇంటి పైకప్పు కొట్టుకుపోయింది. బాధిత కుటుంబాలను పెంబి జెడ్పీటీసీ జానుబాయి పరామర్శించి ఆర్థికసాయం చేశారు. మేడంపల్లి గ్రామంలోని ఎం.గంగాదేవికి ఇళ్లు కూలిపోయింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వ్యవసాయాధికారులు పంటనష్టం, రెవెన్యూ, విద్యుత్ అధికారులు ఇతర నష్టాలపై అంచనా వేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నాలుగెకరాల్లో నేలరాలింది..



ఈదురుగాలులకు నాకున్న నాలుగెకరాల మామిడితోటలో కాయలన్నీ నేలరాలాయి. రెండు రోజుల్లో తెంపుదామనుకుంటే గాలివానకు కాయంతా మట్టిపాలైంది. రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– బత్తుల నర్సయ్య, కల్లెడ, కడెం మండలం

పంట మొత్తం దెబ్బతింది



నాకున్న నాలుగెకరాల్లో వరిపంట వేసుకున్న. పంట బాగా పండిందని అనుకున్న. ఇంతలోనే ఈదురుగాలులు పంటమొత్తం దెబ్బతీశాయి. పొలంలో కోతకు కూడా కష్టంగా మారింది.

– ఓస రవి, లక్ష్మణచాంద

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండురోజుల క్రితమే బేరగాళ్లు పంట కొనేందుకు వచ్చారు. గిట్టుబాటు కాలేదని అమ్మలేదు. ఇంతలోనే భారీ గాలులతో మామిడి కాయలన్నీ రాలి దెబ్బతిన్నాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– హన్మాండ్ల రాజన్న, కల్లెడ

లక్ష్మణచాంద మండలంలో..



నేల వాలిన నువ్వు పంట

లక్ష్మణచాంద: మండలంలో గాలీవాన బీభత్సానికి నువ్వు, వరి పంటలు దెబ్బతిన్నాయి. రెండు పంటలు ప్రస్తుతం చేతికి వచ్చే దశలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పీచర గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి మామిడి తోటలో కాయలన్నీ నేలరాలాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఐదు విద్యుత్ పోల్స్ విరిగాయని ఏఈ మహేశ్ తెలిపారు. కొన్ని గ్రామాలకు రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.

దస్తురాబాద్ మండలంలో..



దేవునిగూడెంలో నేల రాలిన మామిడి కాయలు...

దస్తురాబాద్: అకాల వర్షానికి మండలంలో వరి, మొక్కజొన్న, నువ్వు, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. దేవునిగూడెం గ్రామానికి చెందిన బంగారి కిషన్, బంగారి సూధకర్‌కు చెందిన 10 ఎకరాల మామాడి తోటలో కాయలు పూర్తిగా నేలరాలాయి. ఎమ్మెల్యే రేఖానాయక్ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు పరిహారం అందేలా చూస్తానని తెలిపారు. నష్టం అంచనవేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన బెడద బీమక్క ఇంటి రేకులు కొట్టుకుపోవడంతో ఎమ్మెల్యే రూ.5 వేల సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ శారద, వైస్ ఎంపీపీ రాజునాయక్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి

లోకేశ్వరం: యాసంగిలో జిల్లా రైతులు పండించిన ప్రతీ వరి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజూర గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఐకేరెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగిలో జిల్లాలో 204 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా గన్నీ బ్యాగులు, లారీలను ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. రూ.1.30 కోట్లతో రాజూర గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది పూర్తయితే వ్యవసాయానికి 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. కార్యక్రమాల్లో కలెక్టరు వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చెర్మన్ భోజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టరు రాంబాబు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నిర్మల్ విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహాన్, డీసీవో తనూజ, డీఎం శ్రీకళ, తహసీల్దార్ సరిత, విద్యుత్ ఏఈ శివప్రసాద్, సర్పంచ్ ముత్తగౌడ్ పాల్గొన్నారు.

భగీరథ నీళ్లు వృథా చేయొద్దు

నర్సాపూర్(జి): ప్రభుత్వం ఇంటింటికీ సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిని వృథా చేయొద్దని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం నసీరాబాద్‌లో శుక్రవారం మిషన్ భగీరథ నీటిని పరిశీలించారు. మిషన్ భగీరథ పథకం అద్భుతమని అన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, సర్పంచ్ గోవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్ ఉన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- లోకేశ్వరంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

లోకేశ్వరం: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతోనే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా అందిస్తున్నామన్నారు. ఆసరా పథకంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అర్లి వంతెనకు, ముథోల్ వరకు తారు రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా సర్వే ప్రకారం అన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తామన్నారు. లోకేశ్వరం నుంచి నందిపేట్ వరకు నిర్మించే రోడ్డుతో పంచగుడి గ్రామంలో ఇళ్లు కోల్పోయే లబ్ధిదారులకు పరిహారం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చెర్మన్ భోజారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఇన్‌చార్జి(ఎమ్మెల్సీ) గంగాధర్‌గౌడ్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, లోకేశ్వరం సర్పంచ్ దార్వడి సౌజన్య, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు భుజంగ్‌రావు, సర్పంచులు ముత్తగౌడ్, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రావు, శైలజ, ఎల్లన్న, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గడువులోపు గగనమే..!

- సీఎంఆర్ పూర్తి చేయాలని అధికారుల ఒత్తిళ్లు
- రైస్‌మిల్లులకు రోజువారీ టార్గెట్లు



మిల్లులో ధాన్యం

భైంసాటౌన్(ముథోల్): జిల్లాలో యాసంగి వరిధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈసారి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చిన ధాన్యం రైస్‌మిల్లులకు కేటాయించాల్సి ఉంటుంది. కానీ గత యాసంగికి సంబంధించి ఇప్పటికీ సీఎంఆర్ పూర్తి కాలేదు. కొన్ని రైస్‌మిల్లుల్లో రెండేసి సీజన్ల ధాన్యం నిల్వలున్నాయి. ప్రస్తుతం ఈ సీజన్ ధాన్యం వస్తే చోటులేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గత యాసంగికి సంబంధించి సీఎంఆర్ త్వరగా పూర్తి చేయాలని అధికారులు రైస్‌మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నెలాఖరులోగా వందశాతం పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

30 శాతం ఆ మిల్లుల్లోనే...

జిల్లాలో 2021–22 యాసంగిలో 32 రైస్‌మిల్లులకు 98,776.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 66,593.620 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. 38,476.495 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించగా మరో 28,117.125 మెట్రిక్ టన్నులు అప్పగించాల్సి ఉంది. కానీ అధికారులు ఇప్పటివరకు 60 శాతం సీఎంఆర్ పూర్తయినట్లు పేర్కొంటున్నారు. మరో 40 శాతం పూర్తి కావాల్సి ఉందంటున్నారు. అయితే చాలామంది రైస్‌మిల్లర్లు దాదాపు లక్ష్యానికి చేరువలో ఉండగా 9 రైస్‌మిల్లుల్లోనే 30 శాతం వరకు సీఎంఆర్ పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు రైస్‌మిల్లుల్లో తనిఖీ నిర్వహించారు. ఏప్రిల్ 30 లోగా వందశాతం పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ మేరకు సీఎంఆర్‌లో వెనుకబడిన రైస్‌మిల్లులకు రోజువారి టార్గెట్ విధించారు. రోజుకు 57 ఏసీకేలు(బియ్యం లారీలు) చొప్పున పూర్తి చేస్తేనే వందశాతం లక్ష్యం చేరుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. మరో పదిరోజుల గడువు మాత్రమే ఉండగా 40శాతం ఎలా పూర్తి చేస్తారోనని సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు ప్రస్తుత యాసంగి వరిధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో గత సీజన్ సీఎంఆర్ సకాలంలో పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

నెలాఖరులోగా పూర్తి చేయాలి

2021–22 యాసంగి సీజన్‌లో కేటాయించిన ధాన్యం సీఎంఆర్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రైస్‌మిల్లర్లకు సూచించాం. 60 శాతం ప్రక్రియ పూర్తయింది. త్వరలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో భాగంగా గత సీజన్ సీఎంఆర్ త్వరగా పూర్తి చేయాలని సూచించాం.

– తనూజ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి, నిర్మల్

ఉచితంగా.. ఉపకరణాలు!

- దివ్యాంగులకు సదవకాశం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాకు 109 ఉపకరణాలు కేటాయింపు
- ఈ నెల 25 వరకు దరఖాస్తు గడువు



దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ(ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వందశాతం సబ్సిడీతో అవసరమైన ఉపకరణాలు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈనెల 25లోగా దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. జిల్లా సంక్షేమ శాఖ అధికారులు దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా పరికరాలు, వాహనాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు సిద్ధం చేస్తున్నారు.

రాయితీలా ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇప్పటికే నెలనెలా రూ.3,016 చొప్పున ఆసరా పింఛన్ ఇస్తోంది. డీఆర్డీఏ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి రాయితీ బస్‌పాస్‌లు జారీ చేస్తోంది. దివ్యాంగుల వివాహాలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అలాగే వందశాతం రాయితీపై ఉపకరణాలూ అందించనుంది. దివ్యాంగులు చేయాల్సింది https//tsobmms.cgg.gov.in పోర్టల్‌లో ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లాకు 109 ఉపకరణాలు

అర్హత కలిగిన దివ్యాంగులకు అందించేందుకు జిల్లాకు 109 పరికరాలు మంజూరయ్యాయి. ఇందులో రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికిల్స్ 8, బ్యాటరీ వీల్‌చైర్లు 6, ల్యాప్‌టాప్‌లు 4, మూడు చక్రాల రిక్షాలు 16, సాధారణ వీల్‌చైర్‌లు 2, చంక కర్రలు 30, చేతికర్రలు 10, డైసీ ప్లేయర్లు 1, బధిరులకు శ్రవణ యంత్రాలు(హియరింగ్ హెడ్స్) 10, స్మార్ట్ ఫోన్స్ 3, టీఎల్ఎం కిట్స్ 6, 4జీ స్మార్ట్ ఫోన్లు 11 ఇవ్వనున్నారు.

అంధులకు అందజేసేవి.. అర్హతలు

ల్యాప్ టాప్..

- 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు, 75 శాతం మించి అంధత్వం ఉండి ప్రస్తుతం రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నత చదువులు చదువుతున్న అంధ విద్యార్థులు(కళాశాల ప్రస్తుత విద్యా సంవత్సర బోనఫైడ్ తప్పనిసరిగా జతచేయాలి) అర్హులు.
- 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు, 40 శాతం వైకల్యం ఉండి ప్రస్తుతం పీహెచ్‌డీ అభ్యసిస్తున్న విద్యార్థులు(కళాశాల ప్రస్తుత విద్యా సంవత్సర బోనఫైడ్ జతచేయాలి)

డైసీ ప్లేయర్లు..

15 అంతకంటే ఎక్కువ వయసు ఉండి, 75 శాతానికి మించి అంధత్వం ఉండి ప్రస్తుతం ఇంటర్ చదివే వారికి (కళాశాల ప్రస్తుత విద్యాసంవత్సర బోనఫైడ్ తప్పనిసరిగా జతచేయాలి) డైసీ ప్లేయర్లు అందిస్తారు.

శారీరక దివ్యాంగులు.. అర్హతలు

రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికిల్స్..

- 18 నుంచి 50 ఏళ్ల వయసు ఉండి ప్రస్తుతం రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నత చదువులు చదువుచున్న శారీరక వైకల్యం ఉన్న విద్యార్థులు.
- 18 నుంచి 50 ఏళ్ల వయసు ఉండి ఉపాధి పొందటానికి ఇంటర్మీడియట్ అర్హత కలిగిన నిరుద్యోగ శారీరక దివ్యాంగులు అర్హులు.

బ్యాటరీ వీల్ చైర్..

12 ఏళ్ల వయసు దాటి మస్కులర్ డిస్ట్రోఫి, వెన్నెముక సమస్యతో బాధపడుతున్న దివ్యాంగులు అర్హులు. లేదా 90% లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగి ఉండి రెండు కాళ్లు లేక, పోలియో లేక నడువ లేని స్థితి ఉన్న శారీరక దివ్యాంగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు చక్రాల రిక్షా:

16 నుంచి 50 ఏళ్లలోపు వయసు ఉన్న శారీరక దివ్యాంగులు

సాధారణ వీల్ చైర్..

పదేళ్ల నిండి, పూర్తిగా నడువలేని శారీరక దివ్యాంగులు, మానసిక దివ్యాంగులు, మస్కులర్ డిస్ట్రోఫి, వెన్నెముక సమస్యతో బాధపడుతున్న దివ్యాంగులు.

కృత్రిమ అవయవాలు, చంక కర్రలు:

ఆరేళ్లు అంతకంటే ఎక్కువ వయసు వారు తక్కువ అవయవాలతో బాధపడుతున్న వారికి(కాలు, చేతి లేకపోవడం) కృత్రిమ అవయవాలు, 10 ఏళ్ల వయసు నిండి తక్కువ అవయవాలతో బాధపడుతున్న వారు (కాలు లేకపోవడం, పోలీయోతో బాధపడడం మొదలగునవి) చంక కర్రలకు అర్హులు.

అర్హులు వీరు..

75 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉండి 18–50 ఏళ్లలోపు వయసు ఉన్న దివ్యాంగులు వందశాతం రాయితీపై మోటార్ వెహికిల్ అందుకునేందుకు అర్హులు. అదేవిధంగా వారు డిగ్రీ లేదా ఇంటర్ పూర్తిచేసి మూడేళ్ల కాలపరిమితి దాటి ఉండాలి.

బధిరులు.. అర్హతలు..

హియరింగ్ హెడ్స్:

5 ఏళ్లు నిండి 51 శాతం వినికిడి లోపం ఉన్నవారికి ఆడియోలజిస్ట్ ద్వారా ధ్రువీకరించిన ఆడియోగ్రాం చార్ట్ కలిగిన బధిరులు అర్హులు.

4జీ స్మార్ట్ ఫోన్లు..

- 16 నుంచి 50 ఏళ్ల వయసుండి వైకల్య శాతం 51 కంటే ఎక్కువ కలిగి ప్రస్తుతం ఇంటర్మీడియట్ లేదా ఆపై ఉన్నత చదువులు రెగ్యులర్/ డిస్టెన్స్ పద్ధతిన విద్యనభ్యసించుచున్న బధిర విద్యార్థులు అర్హులు.
- 16 నుంచి 50 ఏళ్లలోపు వయసు ఉండి, మూడేళ్లుగా ఉపాధి పొందటానికి పదో తరగతి ఉత్తీర్ణత అర్హత కలిగిన నిరుద్యోగ బధిరులు.

మానసిక వైకల్యం గల దివ్యాంగులు బోధన, అభ్యాసన పరికరాలు...

- వైకల్య శాతం 40 కంటే ఎక్కువ కలిగి ఉన్న మానసిక దివ్యాంగులు (మేధో దివ్యాంగులు) అర్హులు.

దరఖాస్తు చేసుకోవాలి...



తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం ఉపకరణాలు అందించనుంది. శారీరక వైకల్యంతోపాటు బధిరులు, మానసిక దివ్యాంగులు ఉపకరణాలు పొందేందుకు అర్హులు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు ఉపకరణాలు పంపిణీ చేస్తాం. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– విజయలక్ష్మి, మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి

అటవీయేతర పనుల నిలుపుదల

నిర్మల్: జిల్లాలోని సారంగపూర్ మండలంలో చించోలి(బి)లో ఒకేషనల్ ట్రెనింగ్, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, అప్రోచ్ రోడ్డు కోసం కేటాయించిన అటవీభూమిలో అటవీయేతర పనులను నిలిపివేయాలంటూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్(కేంద్ర) డాక్టర్ డి.మంజునాథ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మరోసారి ఉత్తర్వులను పేర్కొంటూ రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖరాశారు. ఇందులో నిర్మల్ మున్సిపల్‌లో ఒకేషనల్ సెంటర్ కోసం కేటాయించిన అటవీ భూమిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ సెంటర్ కోసం ఇచ్చిన అటవీ స్థలాన్ని మున్సిపల్ ఈద్గా నిర్మాణానికి కేటాయించినట్లు చించోలి(బి)కి చెందిన కె.వెంకటేశ్ ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయవాది అంజుకుమార్‌రెడ్డి రిట్ పిటీషన్ వేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అటవీయేతర కార్యకలాపాలు చేపట్టవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిర్మాణ పనులు నిలిపివేయాలి..

చించోలి(బి) అటవీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలంటూ బీజేపీ నాయకులు పీసీసీఎఫ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని కార్యాలయానికి వచ్చిన ఆయనను కలిసి విన్నవించారు. ఇందులో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి, మెడిసెమ్మెరాజు, సామరాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసాటౌన్: భైంసా పట్టణంలో పేకాడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక కుభీర్‌రోడ్డులోని మారుతి ఫ్యాక్టరీ వెనుక వైపున ఖాళీ స్థలంలో శుక్రవారం పలువురు పేకాడుతున్నట్లు సమాచారం పోలీసులు చేరుకుని తొమ్మిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,490 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎల్ శ్రీను పేర్కొన్నారు.

అమర జవాన్లకు నివాళి


నివాళులర్పిస్తున్న హిందూవాహిని సభ్యులు

భైంసాటౌన్: జమ్ము కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత జవాన్లకు పలువురు నివాళులర్పించారు. భైంసాలోని భగత్‌సింగ్‌చౌక్‌లో శుక్రవారం రాత్రి హిందూవాహిని ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

వీర జవాన్లకు నివాళి


నివాళులర్పిస్తున్న యువకులు

భైంసా రూరల్ : జమ్ముకశ్మీర్‌లోని పూంచ్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రవాదుల జరిపిన దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు మిర్జాపూర్ గ్రామంలో నివాళులర్పించారు. భీమ్‌సేనా యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వీర జవానుల ఆత్మశాంతి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జీసీసీ పెట్రోల్ బంక్‌లు మూత

- అధికారుల తప్పిదాలతో సంస్థకు నష్టం
- జిల్లాలో ఆరు బంక్‌ల్లో నాలుగు మూసివేత
- మరింత నష్టాల్లోకి జీసీసీ


ఇచ్చోడలో మూత పడ్డ జీసీసీ పెట్రోల్ బంక్

ఇచ్చోడ: గిరిజన కో ఆపరేటివ్ సంస్థ (జీసీసీ) ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లు అనతి కాలంలోనే మూతపడ్డాయి. జీసీసీ సహకార సంస్థను మరింత లాభాల బాటలో నడిపించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆ సంస్థ ఆరు పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసింది. పెట్రోల్ బంక్‌ల ద్వారా గిరిజన సహకార సంస్థను మరింత లాభాల వైపు నడిపించడంతో పాటుగా గిరిజన యువతకు ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేశారు. బంక్‌ల ఏర్పాటు కోసం ప్రధాన కూడళ్ల వద్ద విలువైన స్థలాలను ఐటీడీఏ ద్వారా కేటాయించి బంక్‌ల నిర్మాణం చేపట్టారు. కానీ నిర్మాణం చేపట్టిన తక్కువ కాలంలోనే బంక్‌లు మూతపడ్డాయి. దీంతో జీసీసీ సంస్థ లాభాల బాటలోకి వెళ్లడం ఏమో కానీ నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఆరు బంక్‌లు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం ఆరు బంక్‌లు నిర్వహిస్తున్నారు. అందులో ఇచ్చోడ, సిరికొండ, కెరమెరి, జైనూర్, నిర్మల్, ఉట్నూర్‌లో జీసీసీ పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసింది. కానీ నాలుగు నెలల నుంచి ఇచ్చోడ, సిరికొండ, కెరమెరి, జైనూర్ పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయి.

అధికారుల తప్పిదంతో...

అధికారుల తప్పిదంతోనే పెట్రోల్ బంక్‌లు మూతపడినట్లు తెలుస్తోంది. పెట్రోల్ బంక్‌ల నిర్వహణ సరిగ్గా లేక, బంక్‌లు పర్యవేక్షిస్తున్న జీసీసీ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, నో స్టాక్ బోర్డులు తగిలించడం, వినియోగదారులకు సరైన సేవలు అందించకపోవడం లాంటి కారణాలతో పాటు ముందస్తుగా ఐటీ రీటన్స్ చూపకపోవడంతో ప్రధాన కారణంగా తెలుస్తోంది. జీసీసీ ఉన్నతాధికారులకు ముందు చూపు లేకపోవడంతోనే పెట్రోల్ బంక్‌లపై ఐటీ రూపంలో భారీగా ఐటీ శాఖ కట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. జీసీసీ శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు ఐటీ రూల్స్ తెలియకపోవడంపై పలువురు విస్మయం చెందుతున్నారు. మూతపడిన నాలుగు పెట్రల్ బంక్‌ల్లో దాదాపుగా రూ.కోటి వరకు ఐటీ కట్ అయినట్లు సమాచారం. ఈ డబ్బులు తిరిగి తెప్పించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని, అప్పటి వరకు బంక్‌లను మూసివేశామని, డబ్బు రాగానే బంక్‌లను తెరిపిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ పలు అనుమానాలకు తావిస్తోంది.

మరింత నష్టాల్లోకి..

నాలుగు నెలల నుంచి బంక్‌లు మూతపడడంతో మరింతగా నష్టాల్లోకి జీసీసీ వెళ్లే ప్రమాదం ఉందని తెలుస్తోంది. మూతపడిన నాలుగు బంక్‌లకు విద్యుత్ బిల్లులు, బంక్‌లలో పనిచేసే 60మంది కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు, బంక్‌ల నిర్వహణకు ఇతర ఖర్చుల భారం పడి మరింత నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలుస్తోంది.

నిర్వహణకు డబ్బులు లేకనే..

జీసీసీ బంక్‌ల నిర్వహణకు సంస్థ వద్ద డబ్బులు లేకపోవడంతోనే జిల్లాలో కొన్ని బంక్‌లు మూతపడ్డాయి. ఐటీ కట్ కావడం కూడా బంక్‌ల బంద్‌కు కారణమైంది. సంస్థకు డబ్బులు రాగనే బంక్‌లను పునః ప్రారంభిస్తాం.

– రామానందం, జిల్లా మేనేజర్

ఐడియా అదిరింది.. విద్యుత్ సమస్య తీరింది


విద్యుత్ లైన్‌కు మరమ్మతు చేస్తున్న లైన్‌మెన్

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో ఈదురు గాలుల కారణంగా విద్యుత్ వైర్‌లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ శ్రీధర్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రెండు స్తంభాలకు మధ్యలో ఉన్న విద్యుత్ వైరు తెగి మరమ్మతుకు ఇబ్బందిగా మారింది. ట్రాక్టర్ ట్రాలీని జాకీ సాయంతో పైకిలేపగా ట్రాలీపై కూర్చుని విద్యుత్‌వైరుకు మరమ్మత్తు నిర్వహించి విద్యుత్ సరాఫరాను పునరుద్ధరించాడు.

విక్రాంత్ సీడ్స్‌పై కేసు నమోదు చేయాలి


ఫిర్యాదు చేస్తున్న రైతులు

జైనథ్: విక్రాంత్ సోయా సీడ్స్ కంపెనీపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విక్రాంత్ కంపెనీపై ఫిర్యాదు చేశారు. నాసిరకం సోయా విత్తనాలతో మండలంలో వందలాది మంది రైతులు మోసపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందిస్తామని విక్రాంత్ సీడ్స్ ప్రతినిధులు వ్యవసాయశాఖ అధికారులకు లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేసిన జాబితాలో తమ పేర్లున్నప్పటికీ ఇప్పటివరకు తమకు పరిహారం ఇవ్వలేదని వాపోయారు. దాదాపు ఏడాదిగా ప్రతినిధులు రేపు, మాపు అంటూ దాటవేస్తున్నారని, కంపెనీ కేసు నమోదు చేయాలని కోరారు.

ఈద్గాకు మున్సిపల్ నిధుల కేటాయింపుపై నిరసన


వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌ఖైసీగేట్: పట్టణాభివద్ధి కోసం ఖర్చు చేయాల్సిన మున్సిపల్ నిధులను సారంగాపూర్ మండలం చించోలి(బి) వద్ద నిర్మించిన ఈద్గాకు కేటాయించడంపై బీజేపీ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడికి యత్నించారు. పోలీసులు బీజేపీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య సుమారు గంటపాటు వాగ్వాదం జరిగింది. అనంతరం మున్సిపల్ ఆర్ఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ..వత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రం కోసం కేటాయించిన 12 ఎకరాల అటవీ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఈద్గా నిర్మించడంతోపాటు, నిర్మాణానికి రూ.1.30 కోట్లు మున్సిపాలిటీ నుంచి కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలు చెల్లించే పన్నులను పట్టణ ప్రజల అవసరాలు, సౌకర్యాల కోసం ఖర్చు చేయాల్సి ఉండగా నిబంధనలు ఉల్లంఘించి మున్సిపల్ పరిధిలో లేని ఈద్గాకు కేటాయించారని ఆరోపించారు. మతపరమైన కార్యక్రమాలకు ప్రజాధనం ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ కౌన్సిలర్లు మౌనం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసిమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, శ్రావణ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేని నర్సాగౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పొన్నం నారాయణగౌడ్, మండల అధ్యక్షులు తోకల అనిల్, ఠాగూర్, అర్జున్, మేకల ప్రేమ్ కుమార్, కోరిపల్లి లింగారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, యువమోర్చా నాయకులు కొండాజి శ్రావణ్, ఆకుల కార్తీక్ గిల్లీ, విజయ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి చిన్నోడికి.. పెద్ద కష్టం

- చిన్నారికి రక్తప్రసరణ వ్యవస్థలో ఇబ్బంది
- లక్షల్లో వైద్య ఖర్చులు
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


తల్లితో చిన్నారి రాహుల్

నిర్మల్‌రూరల్: ఆడుతూ పాడుతూ తిరిగే చిన్నారి అనారోగ్యానికి గురి కావడంతో నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన వైశాలి, రవి దంపతుల కుమారుడు రాహుల్ (9 నెలలు) రక్తప్రసరణ వ్యవస్థలో ఇబ్బంది తలెత్తింది. వైద్యానికి రూ.లక్షలు కావడంతో ఆ పేద కుటుంబం ఒక్కగానొక్క బిడ్డను కాపాడుకునేందుకు అల్లాడుతోంది. వైశాలి, రవి దంపతులకు మూడేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల తర్వాత రాహుల్ జన్మించాడు. ఏడు నెలల వయసులో జ్వరం రావడంతో జిల్లా కేంద్రంతో పాటు నిజామాబాద్‌లో వైద్యులకు చూపించారు. ఎంతకీ నయం కాకపోవడంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రిని సంప్రదించారు. అయితే అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం రాహుల్‌కు రక్తప్రసరణ వ్యవస్థలో లోపం ఉందని, తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ ఖర్చు సుమారుగా రూ.3.50 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆ నిరుపేద తల్లిదండ్రులు ఆపరేషన్‌కు డబ్బులు లేక తల్లడిల్లుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో తమను ఆదుకోవాలని, దాతల తమ కుమారుడిని కాపాడాలని వేడుకుంటున్నారు.

సంప్రదించాల్సిన నం. 9676034110

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాలీ సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 25న నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా ఘోటిలో నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ జయంతి పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలోగల పూలే గెస్ట్‌హౌస్‌లో మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికసంఖ్యలో హాజరై పూలే, అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, కోశాధికారి సతీశ్‌గుర్నులే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఉమేశ్ రావు ధోలే, కార్యక్రమ నిర్వాహకులు వామన్‌రావు వాడై, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంకిషన్ షిండే తదితరులు పాల్గొన్నారు.

మండుటెండల్లో భిక్షాటన....



నిర్మల్ జిల్లా కేంద్రంలో మండుటెండల్లో పిల్లలను చంకకు కట్టుకొని భిక్షాటన చేస్తున్నారు పలువురు తల్లులు. వీరి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఈ దృశ్యాలు చూసిన పలువురు పాపం అంటూ చర్చించుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అభివృద్ధి పనులు పరిశీలించిన పీసీసీఎఫ్


క్వార్టర్‌ను ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ లోకేశ్ జైస్వాల్

కడెం: కడెం, ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలో పీసీసీఎఫ్(కంఫా)లోకేష్ జైస్వాల్ శుక్రవారం పర్యటించారు. ఉడుంపూర్‌లో సిబ్బంది క్వార్టర్స్‌ను ప్రారంభించారు. బాండు గేటు వద్ద జంగిల్ సఫారీ ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గుట్టపై వాచ్ టవర్‌ను సందర్శించారు. గ్రాస్ ప్లాంట్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్ఆర్‌వోలు అనిత, వినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుడిని కించపర్చిన వ్యక్తిపై కేసు

గుడిహత్నూర్: హిందూ ఆరాధ్యుడు శ్రీకృష్ణుడిని అవమానపర్చేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ కాంబ్లే డిగంబర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. తన ఇన్‌స్టాగామ్ ఐడీపై కృష్ణ భగవాన్‌ను కించపర్చేలా పోస్టుపెట్టి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని గుర్తించిన తోషం గ్రామానికి చెందిన పస్తాపురే బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసర ఆలయానికి వీల్‌చైర్లు అందజేత


వీల్‌చైర్లు అందిస్తున్న బీజేపీ నాయకులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వచ్చే దివ్యాంగ భక్తుల కోసం ముథోల్ బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ ఆధ్వర్యంలో వీల్‌చైర్లు అందజేశారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయన అనంతరం రూ.22వేల విలువైన వీల్‌చైర్లను ఆలయ అధికారులకు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శివరాజ్, పిఆర్‌ఓ విలాస్‌లు అతడిని ఘనంగా సన్మానించారు.

యువకుడిపై వీధి కుక్కల దాడి

ఆదిలాబాద్‌రూరల్: వీధి కుక్కల దాడులు రోజురోజుకూ పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో ఇద్దరిపై వీధి కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం అదే గ్రామానికి చెందిన అభిషేక్ అనే మరో యువకుడిపై కుక్కలు దాడి చేశాయి. గాయపడ్డ అతడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు వరుసగా దాడులు చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. తమ గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలను ఇతర చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.